# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 12 సెప్టెంబరు , 2025 | పేజీలు : 06


## విధుల్లో నిర్లక్ష్యం తగదు..
### విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/పోచంపల్లి :** విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకుల్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గురువారం ఆయన జిల్లాలోని పలు మండలాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి జిబ్లక్పల్లిలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి జూలూరు పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. పోచంపల్లి ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులకు తగు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు ఆర్ఐ వెంకట్ రెడ్డి, ఇతర సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

# పట్టుదలతో చదివితేనే మంచి మార్కులు
### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** విద్యార్థులు పదవ తరగతిలో వార్షిక పరీక్షలకు పట్టుదలతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలన అకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతిలో జరుగుతున్న మ్యాథ్స్ సబ్జెక్టు నోట్ బుక్‌లను పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలకు రైటింగ్ బాగా ప్రాక్టిస్ చేస్తేనే మంచి మార్కులు వస్తాయని సూచించారు. మీరు భవిష్యత్‌లో ఏమి అవ్వాలోని ఉందనో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుకుంటే కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యానారాయణ, ప్రధానోపాధ్యాయులు వసంత, ఉపాధ్యాయులు శైలజ, ఆర్ఐ జగదీష్ పాల్గొన్నారు.

**జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలి**

**ప్రజాపక్షం/చింతలపాలెం:** జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం చింతలపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పదవ తరగతిలో జరుగుతున్న సైన్స్ క్లాస్‌ను సందర్శించి విద్యార్థుల నోటుబుక్స్‌ను పరిశీలించి నిజ జీవితంలో ఉపయోగపడే వాటి బేసిక్ కెమికల్ ఫార్ములాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో జీవితంలో ఎలా స్థిరపడితే బాగుంటుందో పదో తరగతిలోనే నిర్ణయించుకుని దానికి తగ్గట్లుగా ఇంటర్, డిగ్రీ కోర్సులను ఎంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరికి వేరువేరు లైఫ్ స్టైల్స్ ఉంటాయని దానికి తగ్గట్టుగా ఆప్షన్స్ ఎంచుకోవాలని కోరారు. పదవ తరగతిలో కష్టపడి చదివితే భవిష్యత్ బాగుంటుందని, వార్షిక పరీక్షలకు ప్రణాళికలు తయారు చేసుకోని మంచి మార్కులుసాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ సురేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావ, ఉపాధ్యాయులు నారాయణరావు, ఆర్ఐలు వాసుదేవరావు, ఆత్రేయ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వాల పట్ల విశ్వాసం
### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థంగా పనిచేసినప్పుడే అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని ప్రభుత్వాల పట్ల విశ్వాసం పెరుగుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పోచంపల్లి యంపిడివో కార్యాలయంలో గ్రామ పంచాయితీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్స్, గ్రామ పాలన అధికారులు, వార్డు ఆఫీసర్స్, ఎలక్ట్రిసిటీ, ఆర్డబ్ల్యూఎస్ ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన గ్రామాలలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులందరికీ దిశా నిర్దేశం చేశారు. దసర, దీపావళి పండుగలు వస్తున్న సందర్భంగా గ్రామాలలో స్ట్రీట్ లైట్స్, కరెంట్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కాగా ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసిత బాధితులు గౌరెల్లి భద్రాచలం ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూమి కోల్పోయిన రైతులు తమకు గరిష్ఠంగా నష్టపరిహారం చెల్లించాలని న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, యంపిడివో రాపర్తి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, మండల విద్యుత్ అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

## మృత్యు మలుపులు..
### మలుపుల వద్ద పేరుకుపోయిన పిచ్చి చెట్లు

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రధాన రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలుబెంబేలెత్తుతున్నారు . రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనంపై గాని కారులో కాని ప్రయాణం చేయాలంటే ప్రాణం గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి మూలమలుపు మొదలుకొని అటు హైదరాబాదు ఇటు నల్గొండకు వెళ్లే దారి వరకు ఎల్,ఎస్ ఆకారంలో ఉన్న మలుపుల వద్ద అనేక చోట్ల రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారి వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక హఠాత్తుగా స్పీడును కంట్రోల్ చేయలేక అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ గురువారం ఫిల్టర్ హౌస్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదమే అందుకు నిదర్శనం ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజలు బలవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో మలుపుఉన్నట్లు చూపే సూచిక బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా రోడ్డుకు అడ్డంగా మెరుకుపోయి న ముళ్ల పొదలను తొలగించాలనిప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

ఎల్,ఎస్ ఆకారపు మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.దీనికితోడు రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా ఏ వాహనం వస్తుందో గుర్తించడం కష్టమవుతుంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి చెట్ల పొదలను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.





## మార్నింగ్ వాక్‌తో ఎమ్మెల్యే బాలునాయక్ ప్రజలతో మమేకం...
### ప్రతీ మహిళ మహిళా సంఘాలలో చేరాలి...ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలో గురువారం సాగిన జనహిత మార్నింగ్ వాక్ విత్ ఎంఎల్ఏ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఏ బాలునాయక్ ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరిస్తూ అధికారులను సైతం అందుబాటులో ఉంచి ఏ శాఖ సమస్య ఉంటే అక్కడే ప్రజలతో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. దేవరకొండలోని 5వ వార్డులో రైతు రుణమాఫీ, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతి వార్డులో సిసి రోడ్లు, అంతర్గత డ్రైనేజి పనులు, ప్రధాన రహదారుల విస్తరణ పరచడం జరుగుతున్నదని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలందరికి దశల వారిగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి మహిళ మహిళా సంఘాల గ్రూపులలో చేరి వడ్డీ లేని రుణాలను పొందడమే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు పొంది పలు వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. రూ. 1కోటి టియూఎఫ్ఐడిసి నిధులతో ఎల్ఐసి ఆఫీస్ నుండి దేవి టాకీస్ వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ. 2 కోట్ల టియూఎఫ్ఐడిసి నిధులతో కోర్టు నుండి పేట చెరువు వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ. 1.04కోట్ల అమృత్ 2.0 నిధులతో తుల్జమ్మ కుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన, రూ. 65లక్షల టియూఎఫ్ఐడిసి నిధులతో కట్టమిల్లు నుండి తాటికోల్ రోడ్డు వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎంఎల్ఏ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఆలంపల్లి నర్సింహా, దేవేందర్, మాజీ జెడ్పిటిసి అరుణసురేష్, జాన్‌యాదవ్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, వెంకటేష్‌గౌడ్, యూనుస్, రాంసింగ్, హరికృష్ణ, కర్ణాకర్, మాజీ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగదీష్‌రెడ్డి పెద్ద మోసగాడు..
### కవిత లిల్లీపుట్ అనడాన్ని సమర్థించిన ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) :** మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి జగదీష్‌రెడ్డి పెద్ద మోసగాడని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇటీవల అతనిని లిల్లీపుట్ అనడాన్ని ఆయన సమర్థించారు. గురువారం నాగారం మండలంలోని ఫణిగిరి గ్రామంలో రూ.30లక్షల పైచిలుకు సిసి రోడ్డు పనులకు ఆయన శంఖుస్థాపన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల్లో విశ్వాసం లేదని బుధవారం జగదీష్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన తీరుపై ఆయన మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పై ప్రజలకు విశ్వాసం ఉండడం వల్లే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకవచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై మాట్లాడే నైతిక హక్కు జగదీష్‌రెడ్డికి లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఇద్దరం సహచర ఉద్యమకారులమని చెప్పిన ఆయన ఉద్యమ సమయంలో తన ఉపన్యాసం వింటేనే అతనికి లాగు తడిసేదని చెప్పారు. నా పక్కన కూర్చునేందుకు కూడా వణుకుతుండే వాడని తెలిపారు. సూర్యాపేట ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు నీ మెజార్టీ ఎంతని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేతిలో కీసలో చేజారవని ఎద్దేవా చేశారు. ఇకనైన చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



## బైక్ చోరీ

**ప్రజాపక్షం/మునగాల:** ఇంట్లో ఉన్న బైకును చోరీ చేసిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని కృష్ణానగర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు గుండ్లపల్లి నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కృష్ణానగర్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి నర్సిరెడ్డి ఇంటిలో తన ద్విచక్ర వాహనాన్ని ఇంట్లో ఉంచి నిద్రకు ఉపక్రమించగా గుర్తు తెలియని వ్యక్తులు గేట్‌పై నుండి దూకి ఇంట్లోకి చొరబడి బైకును అపహరించారు. ఈ విషయమై మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నర్సిరెడ్డి తెలిపారు.

## 13నజాతీయ లోక్ ఆదాలత్

**ప్రజాపక్షం/మునగాల:** రాజీమార్గమే రాజమార్గమని, కక్షులు, కార్పణ్యాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరు గెలిచినట్లేనని, లోక్ ఆదాలత్‌ను ఇరువర్గాల కక్షిదారులు అంగీకారంలో సత్వర పరిష్కారం పొందవచ్చునని మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13న జరిగే జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌడ్ బుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు ఈ లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ఆత్మకూరు (యం):** మండలంలోని మొదుగుంట గ్రామంలో మామిడి నీలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మొదుగుంట బీఆర్ఎస్ గ్రామ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సోలిపురం తిరుమల్ రెడ్డి, మండల సెక్రెటరీ జనరల్ మామిడి శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు మల్లెపూల ఉపేందర్, కృష్ణారెడ్డి, శంకర్ రెడ్డి మండల నాయకులు సోలిపురం ఎల్లారెడ్డి, పాల సంఘం చైర్మన్ మామిడి రామిరెడ్డి, మామిడి సాంబా రెడ్డి, మామిడి అంజిరెడ్డి, మామిడి ముత్యంరెడ్డి, సోలిపురం వెంకటరెడ్డి, సోలిపురం దేవేందర్ రెడ్డి, ఏనుగు అంజిరెడ్డి, మామిడి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయసేవాధికార సంస్థ ముందంజ




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రతి ఒక్కరికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ ముందు ఉందని సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఫర్హీన్ కౌసర్ అన్నారు. పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సూర్యాపేట పట్టణ మున్సిపాలిటి కార్యాలయంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థతో సమన్వయంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా ప్రసంగించారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస కేసుల గురించి మహిళలకు అవగాహన కల్పించి భార్యకు భర్త నుండి కల్పించే భరణం ఏ విధంగా పొందాలో వివరించారు. మహిళ లేనిదే జీవనం లేదని ఎంతో ఓర్పు, సహనం కలిగి ఉంటారని చెప్పారు. మహిళలు ఎంతో వేధింపులకు గురిచేయడం మంచిది కాదన్నారు. జిల్లా సంక్షేమ అధికారిణి దయానందరాణి మాట్లాడుతూ సృష్టిలో మహిళల పాత్ర చాలా కీలకమని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని చెప్పారు. 18 సంవత్సరాలలోపు అమ్మాయిలు వేధింపులకు గురైతే ఫోక్స్ చట్టం ద్వారా కఠిన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. వివాహమైన తరువాత అత్తింటి వారి నుండి వేధింపులు ఉంటే గృహ హింస చట్టాన్ని ప్రభుత్వం తీసుకవచ్చిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొంపల్లి లింగయ్య, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ రాజు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి వెంకటరత్నం, బి ప్రవీణ్‌కుమార్, పెండం వాణి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, డిఎల్ఎస్ఏ మెంబర్స్ మధు, వెంకటేశ్వరరావు, సందీప్, మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్సియల్ లిటరసి తేజస్విని పాల్గొన్నారు.

# నేడు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** నేడు భువనగిరి పట్టణంలోని లింగభసవ గార్డెన్స్‌లో నిర్వహించే సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు సిపిఐ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సురవరం అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి కోరారు. గురువారం సిపిఐ పార్టీ చౌటుప్పల్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారూ సురవరం 2 పర్యాయాలు ఎంపీగా, సిపిఐ జాతీయ కార్యదర్శిగా చట్టసభలో, ప్రజాక్షేత్రంలో అనేక పోరాటాలు నిర్వహించారని, పార్లమెంట్‌లో అనేక చట్టాల రూపకల్పనలో సురవరం క్రియాశీలక పాత్ర వహించారని అన్నారు. ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ.జహంగీర్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, టంగుటూరు రాములు, కాకి పాండు, దాసరి అంజయ్య, బద్దుల సుధాకర్, నీళ్ల బిక్షపతి, సింగపంగ బుచ్చయ్య, కె.కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని ప్లాట్లను ఆపాలంటూ సిపిఐ వినతి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం జనగాం సీపీఐ గ్రామ శాఖ, ప్రజలు కలిసి స్థానిక సంస్థల కలెక్టర్ భాస్కర్ రావుకు వినతి పత్రం అందజేశారు. అనుమతి లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనధికారికంగా ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ అభివృద్ధి నియమావళి ప్రకారం ఎటువంటి భూ సమీకరణ ప్లాటింగ్ రిజిస్ట్రేషన్ హెచ్ఎంటి అనుమతి తప్పనిసరి అని స్పష్టంగా పేర్కొన్నబడినప్పటికీ కొంతమంది వ్యాపారులు ఈ నియమాలను పట్టించుకోకుండా అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. వెంటనే అదనపు కలెక్టర్ స్పందించి ఇలాంటి అక్రమ ప్లాట్ల విక్రయాలను ప్లాట్ల విక్రయాలను తక్షణమే అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు మంచాల జంగయ్య, కొండూరు స్వామి, బైకని రాజు, శనిగల నరేష్, నాతి యాదయ్య, బిక్షపతి, యాదయ్య, కిరణ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ద్వితీయ బహుమతి

**ప్రజాపక్షం/చండూరు:** క్వాంటం యుగ ఆరంభం అనుకూలతలు సవాళ్లు అంశంపై గురువారం జరిగిన జిల్లా స్థాయి సెమినార్ పోటీలలో చండూరు మండలం బోడంగిపర్తి జడ్‌పిహెచ్ఎస్ ఎంజిఎం కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం. అక్షర జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో నిలిచిన ఎం. అక్షర ను సెమినార్ నిర్వాహకులు అభినందించి సీల్డ్ బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జూరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ ఆర్గనైజర్ వి. లక్ష్మీ పతి, చండూరు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, గైడ్ టీచర్ జి.శంకర్ రెడ్డి పాల్గొన్నారు.





## 13న వీధి కుక్కల దత్తత కార్యక్రమం

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** ఇటీవల కాలంలో ప్రజలపై వీధి కుక్కల దాడులు పెరిగిపోతున్న దృష్ట్యా అవగాహనతో పాటు, వ్యాక్సినేషన్,కుక్కల పట్ల ప్రేమ,దయ చూపించే వారికిజిల్లాలో ఈనెల 13న కుక్కల దత్తత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు.ఈ విషయంపై గురువారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాలంలో కుక్కలు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న సంఘటనలు పెరిగిపోతున్నాయని, అయితే దీనికి ఒక శాస్త్రీయ పరిష్కారంలో భాగంగా జిల్లా యంత్రాంగం వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ తో పాటు,స్టెరిలైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టడమే కాకుండా ,కుక్కల పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 13 న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీపంలో ఉన్న రామ్ నగర్ మున్సిపల్ పార్కులో కుక్కల దత్తత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ ,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

## కొత్త రేషన్ కార్డులకు పథకాలు వర్తింపజేయాలి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** కొత్త రేషన్ కార్డు లబ్ధిదారులకు గ్యాస్ పథకంలో రూ.500లకు వంట గ్యాస్‌కు, గృహ జ్యోతి ఫ్రీ కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం అడ్డగూడూరు మండలానికి విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డిని కలిసి మహాలక్ష్మి పథకంలో రూ.500లకు గ్యాస్, గృహ జ్యోతి ఫ్రీ కరెంట్ వర్తింపజేయాలని సిపిఐ నాయకులు అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి రేకల శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రజలు వివిధ కారణాలతో రేషన్ కార్డు ఉన్న గృహ జ్యోతి ఫ్రీ కరెంట్ రూ.500లకు వంటగ్యాస్ పథకానికి అప్లై చేయకుండా ఉన్న వారికి ఇప్పుడు అవకాశం కల్పించాలని అడిషనల్ కలెక్టర్‌ని కోరమని అన్నారు. అదేవిధంగా రైతులకు సరిపోను యూరియా లేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే అడ్డగూడూరు మండలానికి సరిపడా యూరియా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, నాయకులు చిరబోయిన అవిలమల్లు, వెంకన్న వంశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) :** మండల కేంద్రంలో మెయిన్ రోడ్ నుండి హైస్కూల్ వరకు జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రోడ్డు పనులు ప్రారంభం అవుతున్నాయని ప్రకటనలు చేసి వదిలేసారని, వాస్తవానికి ఒక్క తట్ట మట్టిని కూడా వెయ్యలేదన్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జన్నాయి కోడె నగేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, పిఏపీఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.





## మారయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని నీర్నెముల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నోముల మారయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం మారయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, రాజిరెడ్డి, బత్తుల కృష్ణ, పృద్వీరాజ్, జెల్లా వెంకటేష్, రామిని రమేష్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కొండేటి మల్లయ్య మారయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## వెంకటేశ్వర్‌రావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్తానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రామన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్‌ఖానం అభినందనలు తెలిపి మాట్లాడారు. ఇలాంటి పురస్కారాలు వృత్తిపట్ల మరింత అంకితభావంతో పనిచేయడానికి తోడ్పడుతాయని అన్నారు. అధ్యాపకులు ఆర్.రత్న, మంజుల, లక్ష్మీ నీలిమా, సునీత, తండు కృష్ణకౌండిన్య, సీహెచ్.వెంకట్‌రెడ్డి, డి.కిషన్, బాలరాజు, బ్రహ్మం, రవీందర్‌రావు అభినందించారు.

## రాజుకు సన్మానం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరు హెడ్ మాస్టర్ రాజు జిల్లా స్ధాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన నేపథ్యంలో గురువారం గుండాల సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎండి. షమీమ్‌బేగం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేయడం జరిగింది. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు కోరిన విధంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హెడ్ మాస్టర్ రాజు అంగన్‌వాడీ కేంద్రంలో కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయించి, లైట్, ఫ్యాన్ కూడా అందజేయడం జరిగింది.



## స్పెషల్ టీచర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో స్పెషల్ టీచర్లను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవోకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, కోవిడ్ అనంతరం పిల్లల మానసిక స్థితిలో అనేక మార్పులు వస్తున్నాయని, అనేక రకాల వైకల్యాలతో విద్యార్థులు బాధపడుతున్నారని అన్నారు. పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రవర్తనను అర్థం చేసుకునేందుకు వీలుగా పిల్లల వైద్యులు, డెవలప్‌మెంట్ పీడియాట్రిషియన్స్, స్పీచ్, లాంగ్వేజి థెరపిస్టులు, అక్యూఫెషనల్ థెరపిస్టులు, కౌన్సిలర్స్‌ను నియమించాలన్నారు. వైకల్యం కలిగిన విద్యార్థులు వినియోగించుకునేలా మూత్రశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గిరికల లింగస్వామి, మండల ఉపాధ్యక్షుడు నాగు నరసింహా, పున్న శ్రీధర్, చంద్రశేఖర్, రమేష్, బొడ్డుపల్లి అంజయ్య, క్యాస నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి చోటు లేకుండా సంస్థ అభివృద్ధికి కృషి...



**ప్రజాపక్షం/గుండాల;** అవినీతికి చోటు లేకుండా పిఏసిఎస్ సంస్థ అభివృద్ధికి ఐదు సంవత్సరాలుగా కృషి చేస్తున్నాం అని తమ అభివృద్ధి చూసు ఓర్వ లేక కొందరూ సంస్థపై అసత్య ప్రచారాలు మానుకోవాలని గుండాల పిఏసిఎస్ చైర్మన్ బిక్షం అన్నారు. గురువారం స్ధానిక పిఏసిఎస్ కేంద్రం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను చైర్మన్‌గా పదవి బాద్యతలు చేపట్టిన నాటి నుండి 4 కోట్లుగా ఉన్న టర్నోవర్‌ను నేడు 20 కోట్లకు సాధించామని అన్నారు. పిఏసిఎస్ కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతులకు నాణ్యమైన ఎరువుల పంపిణి సకాలంలో చేపట్టి ఎప్పటికప్పుడు రైతుల మేలు కోరుతూ పాలక వర్గాన్ని ముందుకు సాగిస్తున్నామని పాలక వర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక తమపై బురద జల్లే పన్నాగం చేస్తున్నారని అన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి అవినీతికి తావు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సంస్థ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. సుద్దాల పెట్రోల్ బంక్ విషయమై డైరెక్టర్లు తమపై వాట్సాప్ గ్రూప్ లలో తప్పుడు సమాచారాన్ని పోస్టు చేశారని, ప్రతి పైసా రికార్డు ప్రకారమే వినియోగించామని అన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కొమురయ్య, అంజయ్య, సాగర్, ఉప్పలయ్య, శ్రీను, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీర తెలంగాణ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని బీజేపీ మతం రంగు పూసి చరిత్రను వక్రీకరిస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. మండలంలోని గూడూరు గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమరవీరుల కుటుంబాలను సన్మానించి మాట్లాడారు. నాడు భూస్వాములు, పెత్తందారులు, నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో సబ్బండవర్గాలు, కులమతాలకు అతీతంగా పోరాటం సాగించారని అన్నారు. ఎంతో మంది ముస్లీం నాయకులు నాయకత్వం వహించి తమ ప్రాణాలు పోగొట్టుకున్నారని అన్నారు. దేశ స్వాతంత్ర్యంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో బీజేపీ పార్టీ లేదని, కాని ఆ పోరాటాన్ని ముస్లీం, హిందువుల మధ్య జరిగినట్లు చరిత్రను వక్రీకరిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ



ప్రపంచ మానవాళికి ప్రత్యామ్నాయం ఎర్రజెండానేనన్నారు. ఈనెల 17న నల్లగొండలో నిర్వహించే వారోత్సవ సభకు సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ రానున్నందున అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పోతినేని సుదర్శన్, వనం నాగేశ్వర్‌రావు, తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాసం, బండ శ్రీశైలం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, చౌగాని సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్‌అదాలత్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీపడవచ్చని క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి రాజీమార్గమే రాజమార్గం అన్నారు. అనవసర గొడవలకు, పట్టింపులకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోవద్దని సూచించారు. పోలీసు సిబ్బంది, అధికారులు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి రాజీపడదగిన కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీపడేలా చూడాలని ఆదేశించారు.

## జీతాలు పెంచాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు పెంచాలని పాఠశాలల యాజమాన్యాలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ గురువారం విజ్ఞప్తి చేశారు. ఎక్కువ పని తక్కువ జీతంతో ఎవరైనా పనిచేస్తున్నారంటే అది కేవలం ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులేనన్నారు. పెరిగిన ధరలతో చాలిచాలని జీతాలతో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదులకే పరిమితమై భోదనలు అందిస్తున్నప్పటికీ వారికి జీతం కేవలం రూ.15వేల నుంచి రూ.20వేలు మాత్రమే ఇస్తున్నారని, నెలకు కనీస వేతనం రూ.30వేలు అందించాలన్నారు.



## అవార్డు గ్రహీతలకు సత్కారం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో కొండూరు చంద్రయ్య గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కే క్రమంలో మోకు జారి మధ్యలోకి వచ్చి ఆగిపోయాడు. దీంతో చుట్టుపక్కలనే ఉన్న మరో ముగ్గురు గీత కార్మికులు చంద్రయ్యను చెట్టుపైకి ఎక్కి రక్షించారు. ఈ విషయం తెలుసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముగ్గురు గీత కార్మికులను శాలువాతో సన్మానించారు. అనంతరం పుట్టపాక గ్రామంలోని చేనేత రంగంలో జాతీయ అవార్డులతో పాటు కొండ లక్ష్మణ్ బాపూజీ అవార్డులు అందుకున్న చేనేత కార్మికులకు సన్మానం చేశారు. పుట్టపాకలోని చేనేత క్లస్టర్‌కు ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. తోటి కార్మికుని ప్రాణాలు కాపాడడం వారు చేసిన సహాసాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎక్సైజ్ బాలాజీ నాయక్, ఎంపీఓ నరసింహా రావు, ఎక్సైజ్ ఎస్సై శంకర్ పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవి కాల్వ గ్రామ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమానికి చాకలి ఐలమ్మ వారసులు ముని మనవాళ్ళు మధు, దుర్గాప్రసాద్ ఇద్దరు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కామ్రేడ్‌లు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టు నాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో రజక సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లు యాదగిరి రచక సంఘం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి నర్సయ్య, సిపిఎం అడ్డగుడూరు మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్, వల్లంభట్ల శ్రీనివాసరావు, గ్రామశాఖ కార్యదర్శి నర్సింహా స్వామి పాల్గొన్నారు.

## రైతుల రాస్తారోకో



**ప్రజాపక్షం/తుంగతుర్తి (అర్వపల్లి) :** నియోజక వర్గంలోని అర్వపల్లి మండల కేంద్రంలో గురువారం రైతులు సిపిఎం ఆధ్వర్యంలో యూరియా కొరతను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి వి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడం, ప్రైవేట్ నానో కంపెనీలకు లొంగిపోవడంతో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుందన్నారు. డిమాండ్‌కు ఆధారంగా ఇండెక్స్ 72 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల యూరియాకు 62 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల యూరియా వరకే ఇండెక్స్ పెట్టడం రైతులను ఇబ్బందులకు గురిచేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిగ వెంకన్న, అబ్బులు, మల్లమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, పద్మ, శ్రీను పాల్గొన్నారు.

## సమస్యలపై ఎంపిడిఒతో చర్చ

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలోని వివిధ వార్డులలో నెలకొని ఉన్న వివిధ సమస్యలపై బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవోని కలిసి సమస్యలపై చర్చించారు. ప్రధానంగా నీటి సమస్యల పైన దృష్టి సారించాలని ఎంపీడీవోనీ కోరారు. సానుకూలంగా స్పందించి తక్షణమే ఈ సమస్యని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## పిడుగు పడి పాడి గేదే మృతి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పిడుగు పడి పాడి గేదే మృతి చెందిన సంఘటన గురువారం తుక్కాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన వాళ్లపు పర్వతాలు తన వ్యవసాయ భావి వద్ద బర్రెల కొట్టంలో పాడి గేదెను కట్టివేశాడు. వర్షాలు కురుస్తున్న సమయంలో ఒక్కసారిగా గేదెపై పిడుగు పడడంతో అక్కడికక్కడే చనిపోయింది. దీంతో రూ.80 వేల నష్టం వాటిలిందని భావిత రైతు పర్వతాలు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

## మారయ్య కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని నీర్నెముల గ్రామా నికి చెందిన నోముల మారయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, నాయకులు సాల్వేరు అశోక్, గొరిగె నరసింహ, పున్న వెంకటేష్, ఎండి.అమీర్, ఎస్కె.చాంద్, బత్తుల వెంకన్న, ముత్తయ్య, ఆవుల నరేందర్, జెట్టి శివప్రసాద్, ఆవుల శ్రీధర్, లవణం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మ కార్యక్రమం



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** మండలంలోని మల్లాపురం మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి తల్లి దేశిడి యశోదమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో గురువారం బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ శాసనసభ్యుడు రామవత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డుపల్లి మహేందర్ మండల నాయకులు మాద సుధాకర్ గౌడ్,విష్ణువర్ధన్ రెడ్డి, వంగల కృష్ణారెడ్డి,చిలుముల అనిల్ కుమార్,కర్నాటి రవికుమార్ ఉన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతి

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** కోదాడజడ్చర్ల జాతీయ రహదారి పైన గల నీలం నగర సమీపంలో ఈ నెల 6న రాత్రి 35 నుండి 40 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గుడిపల్లి ఎస్ఐ నరసింహులు తెలిపారు.మహిళను ఎవరైనా గుర్తించినట్లయితే గుడిపల్లి ఎస్ఐ తో పాటు కొండమల్లేపల్లి సీఐలను సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## యువత గంజాయి బారిన పడకుండా పటిష్ఠ చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** యువత గంజాయి బారిన పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం మినీ మీటింగ్ హల్‌లో జిల్లాలో గంజాయి నియంత్రణ పై నిర్వహించిన సమావేశంలో జిల్లా అడిషనల్ డీసీపీ లక్ష్మీ నారాయణ, జిల్లా రెవిన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖల, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల మాదకద్రవ్యాలపై 35 కేసులు నమోదు చేయడం జరిగిందని, 75 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. డ్రగ్స్ వినియోగ ప్రాంతాలను గుర్తించాలన్నారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయం చేసుకుంటు గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్నారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా, యువత వాటి వల్ల కలిగే నష్టాలను తెలిసేలా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాధా కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా వైద్య శాఖ అధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వినూత్న కోర్సుల రూపకల్పన



**ప్రజాపక్షం/నల్లగొండ:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నియామకం తర్వాత ఎన్నో వినూత్న కోర్సుల రూపకల్పన చేస్తునట్లు యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. ధర్మానాయక్ అన్నారు.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ క్యాంపెయిన్‌లో భాగంగా జరిగిన సమావేశంలో డాక్టర్ ధర్మానాయక్ దూరవిద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ మధ్యకాలంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా గంటా చక్రపాణి బాధ్యతలు చేపటిన తరువాత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా చదువుకుంటూ ఉద్యోగం చేసుకునే విధంగా,ఉద్యోగాలు చేసుకుంటూ చదువుకునే విధంగా తీర్చిదిద్దారని తెలిపారు. గ్రామీణగిరిజన విద్యార్థులకు స్వల్పకాలిక వృత్తి విద్యా కోర్సులను కూడా స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ద్వారా ప్రతి సంవత్సరం 5000 మంది గ్రామీణ గిరిజన విద్యార్థులకు ఈ కోర్సులను అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు. దూరవిద్య రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిఏ, బికాం, బిఎస్సి కోర్సులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫసర్ కే శ్రీనివాస రాజు,దూరవిద్య కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్,కౌన్సిలర్లు నగేష్, పద్మ, విజయ,ఉస్మాన్ భాష, నరేందర్, రామ్ రెడ్డి, మల్లికార్జున్,వీరన్న,ధనుజ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/ హాలియా:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి వారు ఆరోగ్యంగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి బొల్లారం బిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని ఎస్సి బాలుర,ఎస్సి బాలికలు, కేజీబీవీ, కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఓ బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యతమైన ఆహారాన్ని అందించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని హాస్టల్ వార్డెన్ లకు సూచించారు. వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను శుభ్రం చేసి వాటిల్లో కూరగాయ మొక్కలు పెంచాలని చెప్పారు. పెంచిన చెట్లనుండి వచ్చే కూరగాయలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనాల్లో అందించాలని తెలిపారు. వసతి గృహాల్లో రాత్రి సమయాల్లో విద్యార్థులు చిన్నపాటి అనారోగ్యానికి గురైన వెంటనే స్పందించి చికిత్స అందేలా వార్డెన్లు స్పందించాలని చెప్పారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఆయా తరగతులను పరిశీలించిన డిఈవో విద్యార్థులతో ముచ్చటించి వారితోనే పాఠ్యాంశాన్ని చదివించారు. దీంతోపాటు కొత్తపల్లి లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ గుండా కృష్ణ మూర్తి తదితరులు ఉన్నారు.

## అకాల వర్షానికి కూలిన నివాస గృహం...



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం నగార దుబ్బ తండాకు చెందిన కరంబోతు అచ్చి భర్త గేమ్యకు చెందిన నివాస గృహం బుధవారం కురిసిన అకాల వర్షానికి కూలిపోవడం జరిగింది. సంబంధిత ఇంట్లో బాదితురాలితో పాటు ఆమె కుమారుడు, కోడలు,ఇద్దరు పిల్లలు ఉంటున్నారు. గురువారం విచారణ నిమిత్తం వెళ్లిన డిండి తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా 50కేజీల బియ్యం, కూరగాయలు అందించి ఇల్లు పూర్తిగా కూలడంతో నష్టపరిహారం కొరకై ఎస్టివో కార్యాలయంలో బిల్లు సమర్పించినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



## మొబైల్ ఎక్స్‌రే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కార్మికులకు ఉపయోగపడేలా ఎక్స్‌రే మిషన్ ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ బహూకరించిన మొబైల్ ఎక్స్‌రేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని బాదలాపురంలో ఉన్న బాలాజీ రైస్ మిల్లులో పనిచేస్తున్న 30 మంది కార్మికులకు ఎక్స్‌రేలు తీసి వారికి ఐదు నిమిషాల్లో రిపోర్ట్ అందించారు. ఈ మొబైల్ ఎక్స్‌రే ఏఐ టెక్నాలజీతో తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, గంట సంతోష్‌రెడ్డి, రేపాల అంతయ్య, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గుడిపాటి శ్రీనివాస్, రేపాల మధు, డాక్టర్ మోహిద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం మిర్యాలగూడ విలేకరులు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సబ్ కలెక్టర్‌కు జ్ఞాపికను అందించారు. సంవత్సరకాలంలో దీర్ఘకాలిక పాత్రికేయుల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సహకరించడం అభినందనీయమని పాత్రికేయులు అన్నారు. కార్యక్రమంలో విలేకరులు ఖాజా హమీదొద్దీన్, రంగా శ్రీనివాస్, ఎండి.అస్లాం, ఎండి.అయూబ్, ఖాజా నాజీమొద్దీన్, పుప్పాల యాదగిరి, కె.నాగాచారి, మందా సైదులు, బొంగరాల మట్టయ్య, గుండా మహేష్, టి.రాజారాం, వినయ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌డి పట్టా పొందిన జావేద్



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రానికి చెందిన షేక్ జావేద్ తెలుగులో ముస్లింవాద సాహిత్యం సామాజిక వాస్తవికత అనే అంశంపై డాక్టర్ కే చంద్రశేఖరరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి పిహెహెచ్ డి పట్టా సాధించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రొఫసర్ కాశీం, పాలమూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్వెంకటప్ రెడ్డిలు జావేద్‌కు పిహెచ్‌డి పట్టా అందజేశారు. ఒక సాధారణ కుటుంబంలోనీ ఆటో డ్రైవర్ కొడుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందడం అభినందనీయమని ఎన్‌వి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ అభినందించారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్య యాదవ్ ఆయన మిత్రులు శ్రేయోభిలాషులు ఉన్నారు.

## మెనూ ప్రకారం భోజనం



**ప్రజాపక్షం/వేములపల్లి:** పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతో పాటు ఆమనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు ను పరిశీలించారు విద్యార్థులకు బోధన విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి డి. జితేందర్ రెడ్డి,తాసిల్దార్ పుష్పలత, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

# ఒకే తరగతి గది...విద్యార్థుల అవస్థలు..

## విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు కేటాయించాలి...



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని పెద్దతండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 44 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులకు పాఠాలను బోధించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో రెండు గదులు ఉండగా గతంలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఒక తరగతి గదిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పాఠశాల తరగతి గదిలోనే నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఈసంవత్సరం పెరగడంతో ఒకే తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలను బోదించాలంటే ఇబ్బందిగా మారిందని, పాఠశాలకు సంబంధించిన గదిని మరల కేటాయించాలని ఆదిశగా మండల విద్యాధికారి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

**మండల విద్యాధికారి వివరణ.....**

సంబంధిత పాఠశాల తరగతి కోసం మండల విద్యాధికారి గోప్యనాయక్ వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టిలో ఉందని, ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాల తరగతి గదికి మార్చాలని ఐసిడిఎస్ సిడిపిఒకు తెలపడం జరిగిందని, గురువారం పాఠశాలను మండల ప్రత్యేకాధికారితో కలిసి సందర్శించానని త్వరలో పాఠశాల తరగతి గదిని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

**విద్యార్థులకు తక్షణమే తరగతి గదిని కేటాయించాలి...**

విద్యార్థులు అన్ని క్లాసులు ఒకే తరగతి గదిలో అన్ని తరగతుల పాఠాలను వినాలంటే ఇబ్బందిగా మారిందని తక్షణమే అధికారులు తరగతి గదికి కేటాయించాలని స్థానిక నాయకుడు రమేష్‌నాయక్ అధికారులను కోరారు.

## భూముల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా విజయ్ కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా నల్లగొండ మండలం చందన పల్లి గ్రామానికి చెందిన కాశిమల్ల విజయ్ కుమార్ గురువారం నియామకమయ్యారు. సమితి చైర్మన్ పల్లపు విజయ్, రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుదిగా విజయ్ కుమార్‌ను నియామకం చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ భూముల పరిరక్షణ సమితి చైర్మన్ పల్లపు విజయ్, రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## 13న వేణుగోపాల స్వామి మాస కళ్యాణం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో 13న స్వామి వారి మాస కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దోసపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాలుగోని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. కల్యాణానికి భక్తులు సహకరించి,కళ్యాణములో కూర్చునే వారు ముందుగా కమిటీకి 8978919500, 994903 4526 నెంబర్లకు ఫోను ద్వారా సమాచారం ఇవ్వగలరని తెలిపారు.

## ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిద్దాం







**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసంం పోరాటాలు కొనసాగించాలని సిపిఎం జోగులాంబ గద్వాలజిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి సందర్భంగా ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1895 సంవత్సరంలో వరంగల్ జిల్లా కిష్టాపురం గ్రామంలో అతి పేద కుటుంబంలో జన్మించి మెట్టినిల్లు పాలకుర్తిలో భూమి కోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా అన్న ప్రజలను భందూకులు చేత పట్టి బరిసెలతో తిరగబడేలా చేసిందని, మహిళాలోకానికి ఆదర్శవంతంగా నిలిచిందని అన్నారు. పోరాటంలో 4వేల మంది అమరులు అయ్యారని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశ చరిత్రలో మైలు రాయిగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, తో పాటు హమాలి యూనియన్ నాయకులు యాదన్న, బీచుపల్లి రాజు, నాగేశ్, రవి, హుస్సేన్, సుంకన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఎల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాడు మండల ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన విఆర్ఎలు బుధవారం రోజు ఎమ్మెల్యే విజయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి, విఆర్ఎల స్థానంలో వారి వారసులకు తక్షణం ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020 లో అసెంబ్లీలో వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి, దీర్ఘకాలిక సమ్మెల తర్వాత జిఓ నెం.81,85 లు విడుదల చేసినప్పటికి, ఇప్పటికీ ఆ హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,555 మంది విఆర్ఎలో 16758 మంది మాత్రమే సర్దుబాటు కాని, మిగతా 3797 మంది వారసులు రెండు సంవత్సరాలుగా నిరీక్షణలో ఉన్నారన్నారు. ఆలస్యాలు, అనిశ్చిత కారణంగా విఆర్ఏ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు, అప్పుల బారిన పడుతున్నాయని, ఇప్పటివరకు 340 మంది విఆర్ఎలు మరణించగా అనేక కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోయాయని వారు గుర్తు చేశారు. తండ్రుల స్థానంలో వారసులను నియమించడం ద్వారా ప్రభుత్వానికి పెద్ద భారమూ లేకుండా, చదువుకున్న యువత రెవెన్యూ శాఖ పనితీరును మెరుగుపరుస్తారని వీఆర్ఎలు తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్యే విజయుడు వీఆర్ఎల సమస్యలను తప్పకుండా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు రఘు రెడ్డి, ఐదు మండలాల వీఆర్ఎల వారసులు పాల్గొన్నారు.



## అర్హతలు లేకుండా వైద్యసేవలు..

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ మండలంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి గురువారం క్లినికల్, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి అర్హత లేకుండా వైద్య సేవలు చేస్తున్న ఓ క్లినిక్‌ను సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బూర్‌గడ్డ, లింగగిరి గ్రామాలలో అనుమతులు లేకుండా ఎలాంటి వైద్య విద్యార్హత లేకుండా వైద్య సేవలందిస్తున్న వట్టికూటి రాంబాబు నిర్వహిస్తున్న క్లినిక్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు. అలోపతి వైద్యం, విద్యార్హత లేకున్నా, ఔషధ పరిజ్ఞాన అర్హత లేకున్నా మెడికల్ షాప్ నిర్వహిస్తున్న వైద్య సేవలు అందించడం చట్టరిత్యా నేరమని ఆయన చెప్పారు. ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ జయమనోరి, డాక్టర్ జి చంద్రశేఖర్, డాక్టర్ నజియా తబస్సుమ్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ వి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాడు మండల కేంద్రంలో కరెంటు లైన్‌మెన్ లేని కారణంగా ఉన్న లైన్మెన్‌కి మానవపాడు ఇంచార్జిగా మారమునగాల గ్రామాలు రెండు ఉండటం వలన మానవపాడు గ్రామంలో విద్యుత్ అంతరాయంలో ఓల్టేజ్ సమస్య గురించి మానవపాడు మండల ఎఈ ని అలంపూరు ఎడిఇ ని కలవడం జరిగింది. పదే పదే ఓల్టేజ్ సమస్య వలన కరెంటు పోయి ఫ్రిజ్జు ఫ్యాన్లు టీవీలు కాలిపోతున్నాయి. మానవపాడు గ్రామానికి పర్మనెంటు లైన్మెన్ ఇచ్చి ఇట్టి సమస్యలను తొందరగా పరిష్కరించవలసిందిగా గ్రామస్తులు కోరడం జరిగింది.

## ఉండవెల్లిలో భారీ వర్షం

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** తుఫాన్ ప్రభావం వల్ల గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో పంట పొలాలన్ని జల భారీ వర్షాలు కురవడంతో పంట పొలాలన్ని జలమయ్యాయని రైతుల ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. చేతికొచ్చిన పంటలు భారీ వర్షాల వల్ల దెబ్బ తినే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం 18.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు తాసిల్దార్ ప్రభాకర్ తెలిపారు. ఇంకా మూడు రోజులు వర్షాలు కొనసాగుతున్న తరుణంలో రైతుల ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభు త్వం నష్టపరిహారం అందుకోవాలని వారు డిమాండు చేశారు. పత్తి ఉల్లిగడ్డ మొక్కజొన్న , మిరప, వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని దిగువ ప్రాంతాల్లో నీళ్లు నిలువచేరి, పంట మొక్కలు ఎదిగే అవకాశం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు పట్టించుకోవాలని తెలిపారు.



# తాటిపూడి గ్రామంలో పర్యటించిన ఎంపిడిఓ




**-నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ పరిశీలన**
**-ఎయిర్ వాల్స్ సమస్యలతో నీటి సరఫరాకు అంతరాయం**
**-నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం**


తాటిపూడిలో తాగునీటి సమస్యకు పరిష్కారమెప్పుడు?

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం తాటిపూడి గ్రామంలో తరచుగా త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు జాప్యం జరుగుతూనే ఉంది. సమస్య వచ్చినప్పుడు ప్రజలు అడిగడం అధికారులు సమాధానం చెప్పడమే జరుగుతుంది తప్ప సమస్యకు పరిష్కారం ఎక్కడ కనిపించడం లేదు. ఈ గ్రామంలో లక్షలు పెట్టి నిర్మించిన వాటర్ ట్యాంక్ గ్రామ ప్రజలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగానే ఉంది. ఈ ట్యాంక్ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయం లేదనే చెప్పవచ్చును. ట్యాంకు సరఫరాకు నీటిని అందించాల్సింది ఎవరు? భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మా తప్పిదం లేదని వారు చెబుతున్నారు. మరి ట్యాంక్ చేసిన పాపం ఏమిటి? దీనికి బాధ్యత ఎవరిది? లక్షల రూపాయలు ఉంటే బాగుంటడా? గ్రామానికి మంచిదా త్రాగునీటి సమస్య తీరుద్దా ఒక్కసారి ఆలోచించండి. అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రజలకు తాగు త్రాగునీటి ఇబ్బంది ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు త్రాగునీరు వస్తుందో ఎప్పుడు బంద్ అవుతుందో వచ్చిన నీరు పంపులు వదిలిన పది నిముషాలకే ఆగిపోతుంది. ఇలా అయితే ఎల ఆగ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ వినుగడలోకి తీసుకొస్తే త్రాగునీటి సమస్యకు పరిష్కారం ఉంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మరో పక్క పాత తాగునీటి వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉందని చెప్పవచ్చును. వాటర్ ట్యాంక్ ఎక్కి శుభ్రం చేయాలి అంటే ట్యాంకు పక్కన ఎక్కాల్సిన ఇనుప నిచ్చెనలు తుప్పు పట్టి విరిగిపోయి కనిపిస్తున్నాయి. దీనివలన ట్యాంక్‌లో కూడా అపరిశుభ్రత ఏర్పడే ప్రమాదం కూడా ఉంది. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతన వాటర్ ట్యాంక్‌ను త్రాగునీటి సరఫరా చేసి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల తాటిపూడిలో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతన వాటర్ ట్యాంక్‌ను మండల పరిషత్ అధికారి సక్రియ, ఎంపివో రాజేశ్వరి మిషన్ భగీరథ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీతో కలిసి నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంకుకు నీళ్ల ఎందుకు ఎక్కడం లేదు అనేదానిపై ఎంపిడివో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరిపి పైప్‌లైన్ హెవీ వాహనాలు తిరగడంతో పగిలిపోవడం జరుగుతూ తరచుగా లీక్ అవుతున్నాయని దానివలన నీటి సరఫరాకు అంతరాయం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల వరకే ఈ నూతన ట్యాంక్ నుంచి వాటర్ పోవడం జరుగుతుందని ట్యాంక్ ఎగువ ప్రాంతానికి నీటి సరఫరా జరగడం లేదని, దానికి సంబంధించిన ఎయిర్ వాల్స్‌కు సంబంధించి ఎస్టిమేషన్ తయారు చేయడం జరిగిందని, తయారు చేసిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నామని త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రస్తుతం గ్రామంలోని పాత ట్యాంక్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నూతన ట్యాంకును పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకొస్తాం. ప్రస్తుతానికి నూతన ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించడం జరిగింది. ఈ ట్యాంక్‌లోకి ఎక్కిన నీరు లోతట్టు ప్రాంతాల వరకే సరఫరా జరుగుతుంది. జిల్లా కలెక్టర్‌కు పంపిన నివేదికకు సంబంధించి అనుమతి రాగానే నూతన ఎయిర్ వాల్స్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో గ్రామ ప్రజలకు త్రాగునీటి అందించడం జరుగుతుందని ఎంపిడివో సక్రియ తెలిపారు. గ్రామంలో ఎంపిడివో సక్రియ, ఎంపివో రాజేశ్వరి పర్యటించి పారిశుద్ధ్యం ఎక్కడ తలెత్తకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

# ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ అమరవీరుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసీపీ రఘులు పాల్గొని అటవీ శాఖ ఉద్యోగులకు అటవీ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం అటవీ అధికారులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో రెయిన్ కోట్, టార్చ్ లైట్, వాటర్ బాటిల్ అందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఎఫ్.ఎడి.ఓ మంజుల, సత్తుపల్లి రేంజ్ ఎఫ్ ఆర్ ఓ స్నేహలత, తల్లాడ రేంజ్ ఎఫ్ఆర్ఓ ఉమా, డిఆర్ఓ పిచ్చేశ్వరరావు, డిఆర్ఓ రామ్ సింగ్, డిఆర్ఓ శ్రీను, సెక్షన్ అధికార్లు నాగరాజు, అరుణ్, నరసింహారావు, బీట్ ఆఫీసర్స్, క్యాంప్ ఆఫీసర్స్, ప్రైవేట్ వాచ్ మెన్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి,మాజీ కౌన్సిలర్స్ నాగుల్ మీరా, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కమల్ పాషా, చల్లగుళ్ల కృష్ణయ్య, పింగిలి సామెలు, గఫార్, భాస్కర్, సత్తుపల్లి పట్టణ,మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# మహోత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

**-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**



**ప్రజాపక్షం/బోనకల్:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహోత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండలంలోని చిరునోముల గ్రామంలోని తామ్రపత్ర గ్రహీత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు రావెళ్ల జానకీరామయ్య స్థూపానికి పూలమాలలు వేసి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను గురవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో, నిజాం పాలనలో జరుగుతున్న దోపిడి, పీడన, వెట్టిచాకిరి, దొరలు, జమీందారులు, జాగీర్దారులకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటంలో కమ్యూనిస్టు యోధులు అనేక త్యాగాలు చేసి ప్రజలకు అండగా నిలచారని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామం ప్రత్యక్షంగా, పరోక్షంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న చరిత్ర ఉందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, 3 వేల గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, వెట్టిచాకిరి రద్దు చేయబడిందని, జమీందారులను గ్రామాల నుండి తరిమికొట్టారన్నారు. సాయుధ పోరాటంలో ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను సైతం అర్పించి తెలంగాణను నిజాం పాలన నుండి విముక్తి కల్పించారని, వారి త్యాగాలను ప్రస్తుత యువతకు తెలిజేసేందుకు ప్రతి సంవత్సరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు తూము రోషన్‌కుమార్, బొల్ల ప్రసాదరావు, ముష్టికుంట్ల శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, చిరునోములు గ్రామ కన్వీనర్ గుంపుల జయరాజు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీ కార్యవర్గ న్నిక నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా కృష్ణారావు, మార్ల జయశంకర్, కోశాధికారిగా సామినేని వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా షేక్ వలీజాన్, ఉపాధ్యక్షులుగా పెంటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సరస్వతి, కార్యదర్శులుగా జి.సుబ్బయయ, సిహెచ్‌ఎస్‌వి.ప్రసాద్, మహిళా కార్యదర్శిగా కొల్లిపర్ల శారదాదేవి, జిల్లా కౌన్సిలర్లుగా సూతకాని ప్రసాద్, జివి.కృష్ణారావు, పొన్నం నర్సింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. మధిర మండల శాఖ ప్రధాన కార్యదర్శి మందయ్య, తల్లాడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మయ్య ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అనంతరం పదవీ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు చల్లా కృష్ణారావు, మాచర్ల జయశంకర్‌లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జిల్లా శాఖల పిలుపు మేరకు పోరాట కార్యక్రమాలకు సంసిద్ధులుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాలపై పిచ్చి తీగలు తొలగింపు




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని తెలగవరం వద్ద, దారుక బంజరు వద్ద విద్యుత్ స్తంభాలపై పిచ్చి తీగలు అలుముకొని విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిలువుటద్దం అనే ప్రజాపక్షం వార్తకు విద్యుత్ శాఖ స్పందించి పిచ్చి తీగలను తొలగించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే సవరించడం పట్ల పెద్ద కోరుకొండి విద్యుత్ శాఖ అధికారికి ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

# శతాధిక వృద్ధురాలు మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎస్‌కె ఫాతిమాబీ (100) గురువారం మృతిచెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా వారిలో ఇద్దరు కుమారులు మృతి చెందారు. వంద సంవత్సరాలు జీవించిన ఫాతిమాబీ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పదివేల వేతన హామీని అమలు పరచాలని ధర్నా



**ప్రజాపక్షం/కల్లూరు:** పదివేల వేతన హామీని అమలు పరచాలని కోరుతూ ఐకెపి వివోఏల సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి వివో ఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వివో ఏ లకు నెలకు 10,000 ఇస్తానని హామీ ఇచ్చారని అట్టి హామీని అమలు పరచాలని, అదే విధంగా పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని, నేరుగా వివోఏల ఖాతాలో వేతనాలు జమ చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని వ్యక్తిగత, ప్రమాద బీమా, సౌక ర్యం 10 లక్షలు సౌకర్యం కల్పించాలని కోరుతూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి వినతి పత్రా న్ని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, వివోఏలు రజిత, లలిత,వెంకట్రావమ్మ, కృష్ణవేణి, మరియమ్మ, మల్లిక, కోటేశ్వరి, దేవమణి పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు జీతాలివ్వాలని వినతి



**ప్రజాపక్షం/వైరా:** గ్రామపంచాయతీ కార్మికుల జీతాలను తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపివో రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీను మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్రమైన ర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు నెలనెల సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు వారి కుటుంబాలు వేదనపడే ప్రమాణం ఉందన్నారు. అడ్డాల మీద కూలీలకు ఇస్తున్న వేతనం కూడా పంచాయతీ కార్మికులకు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. అనంతరం ప్రతి గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరూ ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తేళ్లూరు రాజేష్, నాగుల్‌మీరా ఉన్నారు.

# జయరాజు కుటుంబాన్ని పరామర్శించిన ప్రీతం



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం వైరా మండలం దాచాపురం గ్రామంలో వేల్పుల జయరాజు కుటుంబాన్ని పరామర్శించారు. జయరాజు కుమారుడు వేల్పుల రత్నభారత్, వారి కుటుంబ సభ్యులను అధైర్యపడవద్దని, మీకు అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ తరపున మేమందరం అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దర్జీ చెన్నారావు, పమ్మి అశోక్, అయిలూరి కృష్ణారెడ్డి, సామల భాస్కర్‌రెడ్డి, గూడూరు రామశేషిరెడ్డి, వేల్పుల జయరాజు, కర్నాటి కృష్ణారెడ్డి, తేళ్లూరి వీరయ్య, కంభంపాటి సత్యనారాయణ, కట్ల సాయి, వేల్పుల బాబు, వేల్పుల సుందర్‌రావు, మడుపల్లి ప్రసాద్, వేల్పుల యేసు, వేల్పుల లింగేష్, వేల్పుల మైకేల్, జవ్వాజి రామశేషయ్య, కూరాకుల కృష్ణయ్య, ఆదూరి బాబు తదితరులు పాల్గొన్నారు.